క్లుప్తంగా

వేసవి శిక్షణ శిబిరం

తెనాలిరూరల్: ఏషియన్ యూత్ స్పోర్ట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో తెనాలిలోని యువ క్రికెట్ అకాడమీ సహకారంతో వివిధ క్రీడల సమ్మర్ క్యాంప్ గురువారం ప్రారంభమైంది. క్రికెట్, బ్యాడ్మింటన్, టేబుల్ టెన్నిస్‌లో 40 రోజుల పాటు శిక్షణ ఇవ్వనున్నట్లు క్యాంప్ ఇన్‌చార్జి మాలిక్ తెలిపారు. ముఖ్య అతిథులుగా అకాడమీ డైరెక్టర్ హరిదాసు గౌరీశంకర్, రేపల్లె విజ్ఞాన్ ఒకేషనల్ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ సునీల్‌కుమార్ పాల్గొని, క్యాంప్‌ను ప్రారంభించారు. రిజ్వాన, మానస, శివ, గణేష్, క్రీడాకారులు పాల్గొన్నారు.

నేటి నుంచి మహాయజ్ఞం

తెనాలి: ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం, దేవదాయ ధర్మదాయ శాఖ ఆధ్వర్యంలో విజయవాడలో అష్టోత్తర శతకుండాత్మక చండీ, రుద్ర, రాజశ్యామల, సుదర్శన సహిత శ్రీలక్ష్మీ మహాయజ్ఞం జరగనుందని స్థానిక వైకుంఠపురంలోని శ్రీలక్ష్మీ పద్మావతీ సమేత వేంకటేశ్వరస్వామి దేవస్థానం ఈఓ ఎం.తిమ్మనాయుడు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర సర్వతోముఖాభివృద్ధి, ప్రజల సంక్షేమం, శాంతి, సౌభాగ్యాల కోసం శుక్రవారం నుంచి ఈ నెల 17 వరకు విజయవాడలోని ఇందిరా గాంధి మున్సిపల్ స్టేడియంలో జరగనున్న శ్రీలక్ష్మీ మహాయజ్ఞంలో ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు.

నేడు అభివృద్ధిపై సమీక్ష

కొల్లిపర: స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో శుక్రవారం వివిధ గ్రామాలల్లో ఇప్పటి వరకు జరిగిన అభివృద్ధి పనులపై ఉదయం 11గంటలకు ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ సమక్షంలో సమీక్ష సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో పి.శ్రీనివాసులు తెలిపారు. గురువారం మండల పరిషత్ కార్యాలయంలో ఆయన అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి మండలంలోని శాఖల అధికారులు, పంచాయతీ కార్యదర్శులు, సర్పంచులు, ఎంపీటీసీలు , ప్రజా ప్రతినిధులు హాజరు కావాలని చెప్పారు. మధ్యాహ్నం 2 గంటలకు సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు.

దైవసేవకుడు జీవరత్నం మృతి



తెనాలి: దైవ సేవకుడు ఆలపాటి జీవరత్నం (74) గురువారం తెల్లవారుజామున ఆర్ఆర్ నగర్‌లోని నివాసంలో గుండె పోటుతో మృతిచెందారు. కొద్ది రోజుల క్రితం అనారోగ్యానికి గురైన ఆయనకు తెనాలి, విజయవాడలోని ప్రైవేటు ఆసుపత్రుల్లో చికిత్సలు అందించారు. రెండు రోజుల క్రితం డిశ్చార్జ్ అయ్యారు. రాత్రి నిద్రపోయిన జీవరత్నం, తెల్లవారుజామున గుండెపోటు రావటంతో నిద్రలోనే కన్నుమూశారు. సంగం డెయిరీలో బాయిలర్ సెక్షన్ ఇన్‌చార్జిగా చేసిన జీవరత్నం, తర్వాతి కాలంలో దైవ సేవకుడిగా కాలం గడిపారు. ఆయనకు భార్య, కుమారుడు ఉన్నారు. స్థానిక ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ జీవరత్నం భౌతికకాయాన్ని సందర్శించి, శ్రద్ధాంజలి ఘటించారు.

లిఫ్ట్ ఇచ్చి.. చైన్ స్నాచింగ్

సుద్దపల్లి(చేబ్రోలు): గుర్తుతెలియని యువకుడు బైక్‌పై వచ్చి.. మహిళను బెదిరించి, బంగారు గొలుసు అపహరించిన ఘటన సుద్దపల్లి గ్రామంలో గురువారం జరిగింది. పోలీసుల వివరాల మేరకు.. సుద్దపల్లి గ్రామానికి చెందిన పోతురాజు సాంబ్రాజ్యం మండల పరిధిలోని వడ్లమూడి సంగం డెయిరీలో ఉద్యోగినిగా పనిచేస్తోంది. డెయిరీ నుంచి ఇంటికెళ్లేందుకు బుధవారం రాత్రి వడ్లమూడి క్వారీ దేవాలయం సమీపంలోని రోడ్డు వద్ద నిలబడింది. గ్రామంలోకే వెళ్తున్నానని చెప్పిన గుర్తుతెలియని యువకుడు..ఆమెను బైక్‌పై ఎక్కించుకున్నాడు. రైల్వే గేట్ సమీపంలో బైక్ ఆపి ఆమెను బెదిరించి, మెడలో ఉన్న సుమారు రూ.1.40లక్షల విలువ చేసే నాలుగున్నర సవర్ల బంగారు గొలుసును అపహరించుకుపోయాడు. పోతురాజు సాంబ్రాజ్యం ఫిర్యాదు మేరకు ఎస్ఐ జి.వెంకటాద్రి కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేస్తున్నారు.

5న ప్రభుత్వ కళాశాల భూముల కౌలు వేలం

చేబ్రోలు: చేబ్రోలులోని సూర్యదేవర నరసయ్య ప్రభుత్వ జూనియర్ కళాశాలకు చెందిన వ్యవసాయ భూములకు హై కోర్టు ఉత్తర్వుల మేరకు కౌలు వేలం నిర్వహించనున్నట్లు కళాశాల ప్రిన్సిపల్ కె.సుచరిత గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. 13.55 ఎకరాల మాగాణి, మెట్ట భూమికి జూన్ 5 మధ్యాహ్నం 2.30 గంటలకు కమిటీ ఆధ్వర్యంలో కౌలు వేలం జరుగుతుందని పేర్కొన్నారు. మంచాల గ్రామంలోని సర్వే నంబరు 106లోని 2.11 ఎకరాలు, చేబ్రోలు సర్వే నెంబరు 916, 235, 909/2, 426/2, 760/3లోని 11.44 ఎకరాలకు కౌలు వేలం స్థానిక కళాశాలలో జరుగుతుందన్నారు. కళాశాల కార్యాలయంలో పూర్తి వివరాలను తెలుసుకోవచ్చునని తెలిపారు.

ఇంటికి తాళం వేయడంపై కేసు నమోదు

తెనాలి రూరల్: కుటుంబ కలహాల నేపథ్యంలో ఇంటికి తాళం వేయడంపై కేసు నమోదయ్యింది. పట్టణ శివారు వైఎస్ఆర్ కాలనీలో పిల్లి అబ్రహం కుటుంబానికి ఇల్లు ఉంది. ప్రస్తుతం అది అద్దెకు ఇవ్వగా, అబ్రహం కుమారుడు సుధాకర్ అద్దె వసూలు చేస్తున్నాడు. కుటుంబ కలహాల నేపథ్యంలో గురువారం అబ్రహం, అతని కుమార్తె సుధారాణి ఆ ఇంటికి తాళం వేశారు. ఈ విషయమై గతంలోనూ వారి మధ్య వివాదం నడువగా.. స్పందనలో అర్జీ పెట్టుకున్నారు, సుధాకర్ ఫిర్యాదుపై టూ టౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు.

కొల్లిపర మార్కెట్‌యార్డుకు స్థల పరిశీలన

అధికారులతో ఎమ్మెల్యే శివకుమార్



మార్కెట్ యార్డులో జరిగిన సమావేశంలో ఎమ్మెల్యే శివకుమార్

తెనాలిటౌన్: తెనాలి నియోజకవర్గంలోని కొల్లిపరలో మినీ మార్కెట్ యార్డుకు స్థల పరిశీలన చేస్తున్నట్లు ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ తెలిపారు. రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఫిబ్రవరి 28న తెనాలి పర్యటన సందర్భంగా బహిరంగ సభలో కొల్లిపరలో మినీ మార్కెట్ యార్డు ఏర్పాటుకు నిధులు కేటాయింపుపై హామీ ఇచ్చినట్లు తెలిపారు. మార్కెట్ యార్డు ఆవరణలో గురువారం మార్కెటింగ్ శాఖ ఉన్నతాధికారులతో ఆయన సమావేశం నిర్వహించారు. ఎమ్మెల్యే శివకుమార్ మాట్లాడుతూ కొల్లిపరలో ప్రభుత్వ స్థలాలు లేనందున ప్రైవేటు స్థలం సుమారు 4 నుంచి 5 ఎకరాల మేరకు కొనుగోలు చేసి, జిల్లా కలెక్టర్‌కు నివేదిక అందజేయనున్నట్లు తెలిపారు. ప్రభుత్వం నుంచి అనుమతులు లభించిన తరువాత యార్డు నిర్మాణ పనులు చేపడతామని వెల్లడించారు. శుక్రవారం కొల్లిపరలో అధికారులతో కలిసి స్థలం పరిశీలన చేయనున్నట్లు తెలిపారు. తెనాలి మార్కెట్ యార్డు ఆవరణలో నిర్మాణ చేపట్టనున్న షాపింగ్ కాంప్లెక్స్ పనులకు టెండర్లు పిలిచి, పనులు వేగవంతం చేయాలని అధికారులకు సూచించారు. సమావేశంలో మార్కెటింగ్ జాయింట్ డైరెక్టర్ కానుమాను శ్రీనివాసరావు, అడిషనల్ డైరెక్టర్ రాజాబాబు, యార్డు ఉన్నత శ్రేణి కార్యదర్శి జేవీ సుబ్బారావు, వైఎస్సార్ సీపీ నాయకులు అవుతు నగేష్‌రెడ్డి, సహాయక కార్యదర్శి వేణుగోపాల్, యార్డు సూపర్ వైజర్లు బాజీబాబు, గౌస్ బాషా, బాలు నాయక్ తదితరులు పాల్గొన్నారు.

పేదరికమే ప్రామాణికంగా సంక్షేమ పథకాల లబ్ధి

ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్



మహిళకు సంక్షేమ లబ్ధిని వివరిస్తున్న ఎమ్మెల్యే శివకుమార్


తెనాలి రూరల్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి నేతృత్వంలోని వైఎస్సార్ సీపీ ప్రభుత్వం పేదరికమే ప్రామాణికంగా అర్హులందరికీ సంక్షేమ పథకాల లబ్ధి అందిస్తున్నట్లు ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ పేర్కొన్నారు. 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమంలో భాగంగా గురువారం తెనాలి మండలం పెదరావూరు గ్రామంలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సెంటర్ నుంచి మూడో రోజు ఇంటింటికీ సంక్షేమ లబ్ధిని ఎమ్మెల్యే ప్రజలకు వివరించారు. సర్పంచ్ కాకి రమాదేవి, ఎంపీపీ చెన్నుబోయిన శ్రీనివాసరావు, జెడ్పీటీసీ గ్రామ ఎంపీటీసీ రావూరి సుజాత, వైఎస్సార్ సీపీ నాయకులు, సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు, సంబంధిత అధికారులతో కలసి గడప గడపకు వెళ్లి ప్రజలతో మాట్లాడారు. నాలుగేళ్ల రాష్ట్ర ప్రభుత్వంలో సంక్షేమ పథకాలు, పొందిన లబ్ధిని వివరించారు. వైఎస్సార్ పెన్షన్ కానుక పెంపుదల, వైఎస్సార్ ఆసరా, వైఎస్సార్ భరోసా, జగనన్న చేదోడు, అమ్మ ఒడి, జగనన్న విద్యా దీవెన వంటి పథకాల లబ్ధిని వివరించారు. అనంతరం మాట్లాడుతూ పెదరావూరు గ్రామంలో రూ.18 కోట్ల సంక్షేమం అందించినట్లు తెలిపారు. అగ్ర వర్ణాల్లో పేదవారైన 74 కుటుంబాలకు ఈబీసీ నేస్తం వస్తోందని, అన్ని కుటుంబాలకు రైతు భరోసా పడుతోందని చెప్పారు. డ్వాక్రా మహిళలకు సంక్షేమ పథకాల ద్వారా పేదలకు ప్రభుత్వం ఆర్థిక భరోసా కల్పిస్తోందన్నారు. కుల మతాలు, పార్టీలు చూడకుండా సంక్షేమాన్ని అందిస్తున్నామని చెప్పారు. పెదరావూరు గ్రామంలో జగన్న కాలనీ పేరిట ఒక ఊరునే నిర్మిస్తున్నామని చెప్పారు. ఎమ్మెల్యే వెంట కుదరవల్లి శంకరరావు, కాకి మనోజ్, రావూరి విజయ్, గొరికపూడి బాలరాజు, అక్కిదాసు కిరణ్‌కుమార్, ఫరీద్, నాగూర్, కౌన్సిలర్లు యాతాటి అనిల్, షేక్ దుబాయ్ బాబు, కఠారి హరీష్ తదితరులు ఉన్నారు.

సంగీత గురువుకు సత్కారం



తెనాలి: శ్రీ వేంకటేశ్వర అన్నమాచార్య సంకీర్తన సేవా బృందం ఆధ్వర్యంలో గురువారం సంగీత గురువు, శ్రీ శారద సంగీతాలయం ప్రిన్సిపల్ ఆంజనేయశాస్త్రిని సత్కరించారు. అన్నమయ్య కీర్తనల ప్రచారంలో భాగంగా ఇటీవల నిర్వహించిన అన్నమయ్య పాటల పోటీల్లో ఆయన శిష్య బృందం 30 మంది ప్రత్యేక బహుమతులను సాధించారు. అన్నమయ్య కీర్తనల్లో తన విద్యార్థులను తీర్చిదిద్దుతున్న కృషికి గుర్తింపుగా గురువును సన్మానించారు. ప్రతి సంగీత గురువు అన్నమాచార్యుల కీర్తనలను తమ విద్యార్థులకు నేర్పుతూ అధిక ప్రచారం చేయాలని సేవా బృందం కన్వీనర్ కొండపి శ్రీనివాసరావు ఈ సందర్భంగా సూచించారు. పంచాంగం హరిణి, సుచరిత, గుత్తా మానస వీణ, ఫణీంద్ర, శ్రీరామ్ పాల్గొన్నారు.

కొనసాగుతున్న హనుమజ్జయంతి ఉత్సవాలు



డ్రైఫ్రూట్స్‌తో వీరాంజనేయ స్వామి అలంకరణ

తెనాలిటౌన్: మారీసుపేటలోని శ్రీ బాలత్రిపుర సుందరీ సమేత శ్రీ చంద్రమౌళేశ్వరస్వామి దేవస్థానంలో హనుమజ్జయంతి ఉత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. పది లక్షల ప్రదక్షిణలు మహాయజ్ఞం నిర్వహిస్తున్నారు. ఉత్సవాల్లో భాగంగా గురువారం వీరాంజనేయస్వామిని డ్రైఫ్రూట్స్‌తో అలంకరణ చేసి, విశిష్ట పూజలు నిర్వహించారు. లలితా గోష్టి వారిచే హనుమాన్ చాలీసా పారాయణం జరిపారు. కార్యక్రమాన్ని ఆలయ కమిటీ అధ్యక్షుడు గ్రంధిసేతు మాధవరావు, కార్యదర్శి పొన్నూరు నాగసూర్య శశిధరరావు, కోశాధికారి వరద వెంకటశేషగిరిరావు, సభ్యులు పేరుబోయిన అంకమరాజు, తాడిపర్తి హరిప్రసాద్‌లు పర్యవేక్షించారు.

● గంగానమ్మపేటలోని శ్రీ విద్యాపీఠంలో దాసాంజనేయస్వామి జయంతి మహోత్సవాలు శుక్రవారం నుంచి ఆదివారం వరకు నిర్వహిస్తున్నట్లు శ్రీ విద్యాపీఠం నిర్వాహకులు బాలస్వామిజీ తెలిపారు స్వామివారికి లక్ష తమల పాకులతో అర్చన, శనివారం 1108 అరటి పండ్లతో అర్చన, ఆదివారం 1108 మామిడి పండ్లతో అర్చన జరిపి పూజలు నిర్వహిస్తమని తెలిపారు. భక్తులు పాల్గొని హనుమంతుని దివ్య అనుగ్రహం పొందాలని బాలస్వామిజీ కోరారు.

● గంగానమ్మపేటలోని చుండూరువారి సత్రంలో శ్రీ ఆంజనేయం ధ్యాన యోగ మండలి ఆధ్వర్యంలో హనుమజ్జయంతి సందర్భంగా ఆదివారం చిల్డ్రన్స్ ఉచిత యోగ శిక్షణ శిబిరం నిర్వహిస్తున్నట్లు యోగ మండలి వ్యవస్థాపకులు కిషోర్ గురూజీ గురువారం తెలిపారు. ఉదయం 6 గంటల నుంచి 7 గంటల వరకు శిక్షణ ఉంటుందని తెలిపారు. వివరాలకు 94407 12208లో సంప్రదించాలని యోగ మండలి కన్వీనర్ కూరపాటి నాగరాజు తెలిపారు.

యూనియన్ గుర్తింపును పునరుద్ధరించాలి

లక్ష్మీపురం: పోస్టల్ రంగంలో అతి పెద్ద యూనియన్‌గా ఉన్న నేషనల్ ఫెడరేషన్‌ఆఫ్ పోస్టల్ ఎంప్లాయీస్(ఎన్ఎఫ్‌పీఈ) గుర్తింపును పునరుద్ధరించాలని కోరుతూ నగరంలోని శంకర్ విలాస్ సెంటర్ నుంచి డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సర్కిల్ వరకు గురువారం సాయంత్రం భారీ ప్రదర్శన నిర్వహించారు. శాసన మండలి సభ్యుడు కె.ఎస్.లక్ష్మణరావు మాట్లాడుతూ పోస్టల్ రంగంలో ప్రైవేటీకరణ విధానాల్ని వ్యతిరేకిస్తూ పలు ఉద్యమాలు చేస్తున్న ఎన్ఎఫ్‌పీఈ గుర్తింపును అప్రజాస్వామికంగా రద్దు చేయడం కార్మిక సంఘాల హక్కుల్ని కాలరాయడమేనని తెలిపారు. సహేతుకమైన కారణాలు చూపకుండా కేవలం రైతుల ఉద్యమానికి, సోదర సంఘాల ఉద్యమాలకు ఆర్థికంగా సహాయపడ్డారనే నెపంతో యూనియన్స్ గుర్తింపును నిరాకరించడం ప్రజాస్వామ్య పద్ధతుల్ని దెబ్బతీయడమేనని పేర్కొన్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి గుర్తింపును పునరుద్ధరించాలని ఆయన డిమాండ్ చేశారు. సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి వై. నేతాజి మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కార్మిక సంఘాల మనుగడను దెబ్బతీస్తోందని విమర్శించారు. కార్మిక వ్యతిరేక విధానాల్ని ఐక్య పోరాటాల ద్వారా ఎదుర్కొంటామని చెప్పారు. వివిధ ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక, ప్రజా సంఘాలు, పెన్షనర్స్ తరఫున ఎం.రామకృష్ణ, టి.వి.జి.రవిశంకర్ పాల్గొన్నారు.

అక్రమ వసూళ్లకు పాల్పడిన ఇద్దరి అరెస్టు



సమావేశంలో వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ ఉమామహేశ్వరరెడ్డి

గుంటూరు ఈస్ట్: సెంట్రల్ జీఎస్టీ అధికారులమంటూ వసూళ్లకు పాల్పడిన ఇద్దరు నిందితుల్ని అరండల్‌పేట పోలీసులు అరెస్టు చేశారు. పోలీసు స్టేషన్‌లో గురువారం వెస్ట్ డీఎస్పీ ఉమామహేశ్వరరెడ్డి, ఎస్‌హెచ్‌ఓ రామానాయక్‌లు విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. సెంట్రల్ జీఎస్టీలో గుమస్తాగా పనిచేసే జి.వెంకటబాబు, స్నేహితుడ్ని వెంటబెట్టుకుని ఈనెల 6వ తేదీ బ్రాడీపేట 6/14లోని గేమ్ వరల్డ్ షాపునకు వెళ్లారు. యజమాని షేక్ ఖాజాను తాము సెంట్రల్ జీఎస్టీ అధికారులమంటూ పరిచయం చేసుకున్నారు. వెంకటబాబు తీసుకొచ్చిన ద్విచక్ర వాహనంపై జీఎస్టీ అని రాసి ఉండటంతో ఖాజా అధికారులని నమ్మాడు. ఇద్దరు జీఎస్టీ చెల్లించాలని బెదిరించారు. ఖాజా అందుకు ఒప్పుకొని రూ. 1700 చెల్లించాడు. అనంతరం ఇద్దరు షాపులోని బ్లూటూత్‌ను అడిగి తీసుకుని వెళ్లారు. ఖాజా నిందితులు వచ్చిన ద్విచక్ర వాహనం నంబరు నోటు చేసుకుని అనుమానంతో పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దర్యాప్తు చేసిన పోలీసులు నిందితులు వెంకటబాబు, అతని అనుచరుడు దార్ల సురేష్‌ను అదుపులోకి తీసుకుని విచారించారు. గురువారం ఇద్దరిని అరెస్టు చేసి రూ. 1700తో పాటు బ్లూటూత్, రెండు ద్విచక్ర వాహనాలు స్వాధీనం చేసుకున్నారు. డీఎస్పీ ఉమామహేశ్వరరెడ్డి మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ సీసీ కెమెరాలు అమర్చుకోవాలని సూచించారు. ఈ కేసులో వాటి ఆధారంగానే నిందితుల్ని గుర్తించామని తెలిపారు.

ఇంటి తలుపులు పగులగొట్టి చోరీ

12 సవర్ల బంగారం, మూడు కిలోల వెండి, రూ.లక్ష నగదు అపహరణ





పరిశీలిస్తున్న సీఐ బందారు సురేష్‌బాబు

పెదకాకాని: ఇంటికి గేటు వేసి ఉండటాన్ని గుర్తించి, తలుపులు పగులగొట్టి చోరీకి పాల్పడిన ఘటన వెంకటకృష్ణాపురం గ్రామంలో చోటుచేసుకుంది. వివరాల మేరకు.. వెంకటకృష్ణాపురం గ్రామానికి చెందిన కంచర్ల నాగేశ్వరరావు వ్యక్తిగత పనుల నిమిత్తం కుటుంబ సభ్యులతో కలసి ఈ నెల 9న బనగానపల్లె వెళ్లాడు. ఇంటికి తలుపులు వేసి ఉండటాన్ని కనిపెట్టిన గుర్తుతెలియని దుండగులు బుధవారం రాత్రి ఇంటి తలుపులు పగులగొట్టి, సుమారు 10 సవర్ల బంగారం, మూడు కిలోల వెండి ఆభరణాలు, లక్ష రూపాయలు నగదు దోచుకెళ్లారు. స్థానికుల సమాచారం మేరకు ఇంటికి చేరుకున్న యజమాని పోలీసులకు సమాచారం ఇచ్చాడు. బాధితుడు నాగేశ్వరరావు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని, దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ బందారు సురేష్‌బాబు తెలిపారు. ఘటనా స్థలంలో క్లూస్ టీం వేలిముద్రలు సేకరించింది.

వివాహిత అదృశ్యం

తెనాలి రూరల్ : వివాహిత అదృశ్యమవడంపై కేసు నమోదైంది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. పట్టణ మోరిస్‌పేటకు చెందిన 35 ఏళ్ల వివాహిత పోతార్లంక రమాదేవి ఈ నెల 7న ఇంటి నుంచి వెళ్లి తిరిగి రాలేదు. గాలించినా ఫలితం లేకపోవడంతో భర్త పోలీసులను ఆశ్రయించాడు. కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు త్రీ టౌన్ ఎస్ఐ ఎం.విజయ్‌కుమార్ తెలిపారు.

తాగునీటి సరఫరాపై అశ్రద్ధ వద్దు



నెహ్రూనగర్: నగరంలో తాగునీటి సరఫరాలో ఎక్కడా సమస్యలు రాకుండా ఇంజినీరింగ్ అధికారులు, ఎమినిటీ కార్యదర్శులు పక్కా ప్రణాళికతో విధులు నిర్వహించాలని, సమస్యలు వస్తే వెంటనే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకురావాలని నగర కమిషనర్ కీర్తి చేకూరి స్పష్టం చేశారు. ఆమె గురువారం వెంగళాయపాలెంలోని నగరపాలక సంస్థ సమ్మర్ స్టోరేజ్ ట్యాంక్, ఆవుల సంరక్షణ కేంద్రం, వెంకటరమణ కాలనీలో ఎన్ఓసీకి దరఖాస్తు చేసుకున్న భవనాల్ని పరిశీలించి అధికారులకు పలు ఆదేశాలు జారీ చేశారు. తొలుత వెంగళాయపాలెంలో నగరపాలక సంస్థ సమ్మర్ స్టోరేజ్ ట్యాంక్‌ని పరిశీలించారు. చెరువు విస్తీర్ణం, నీటి నిల్వ, నగరానికి సరఫరా మార్గంపై ఇంజినీరింగ్ అధికారుల్ని వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తాగునీటి సరఫరాలో సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. వెంగళాయపాలెం చెరువులో పూర్తిస్థాయిలో నీటిని నిల్వ చేయడానికి, మోటార్ల మరమ్మతులకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఎస్ఈని ఆదేశించారు. చెరువు పూర్తిస్థాయిలో నీటితో ఉంటేనే నగరంలోని ఏటీ అగ్రహారం, హౌసింగ్ బోర్డ్ తదితర రిజర్వాయర్ల పరిధిలోని ప్రాంతాలకు సమృద్ధిగా తాగునీటిని సరఫరా చేయగలమని చెప్పారు. చెరువు నింపేందుకు ఎస్ఎస్‌పీ కెనాల్ ఆధారం కనుక ఇరిగేషన్ అధికారులతో చర్చించాలని ఆదేశించారు. చెరువు పరిసరాల్లో వీధి ఆవుల సంరక్షణకు కేటాయించిన సిబ్బంది బాధ్యతగా పని చేయాలని, వాటికి సకాలంలో ఆహారం అందించేలా చూడాలని తెలిపారు. వారానికి రెండు రోజులు పశు వైద్యులు వచ్చేలా ఆ శాఖ జాయింట్ డైరెక్టర్‌కు లేఖ రాయాలని ఎంహెచ్‌ఓని ఆదేశించారు. అనంతరం వెంకట రమణ కాలనీలో ఎన్ఓసీకి దరఖాస్తు చేసుకున్న భవనాల్ని పరిశీలించారు. ఎస్ఈ భాస్కర్, ఎంహెచ్‌ఓ డాక్టర్ భానుప్రకాష్ పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడికి గాయాలు

చేబ్రోలు: ప్రమాదవశాత్తూ ద్విచక్ర వాహనాన్ని కారు ఢీ కొట్టడంతో యువకుడికి గాయాలైన ఘటన చేబ్రోలులో గురువారం జరిగింది. వివరాల మేరకు.. చేబ్రోలు ప్రాంతానికి చెందిన వి.బసవపున్నయ్య బైక్‌పై వస్తుండగా సినిమా హాలు ప్రాంతంలో వెనుక నుంచి వచ్చిన కారు ఢీ కొట్టింది. ఈ ఘటనలో బసవపున్నయ్య కాళ్లు, చేతులకు బలమైన గాయాలయ్యాయి. బాధితుడిని 108 వాహనం ద్వారా ప్రైవేటు వైద్యశాలకు తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

శ్రీలక్ష్మి మహాయజ్ఞం బ్రోచర్ల ఆవిష్కరణ



బ్రోచర్‌లను ఆవిష్కరిస్తున్న ఈవో శ్రీనివాసరెడ్డి, అర్చకులు

తెనాలిటౌన్: దేవాదాయ ధర్మదాయ శాఖ నిర్వహణలో విజయవాడలోని ఇందిరా గాంధీ మున్సిపల్ స్టేడియంలో ఈ నెల 12 నుంచి 17 వరకు అష్టోత్తర శత కుండాత్మక చండీ, రుద్ర, రాజశ్యామల, సుదర్శన సహిత శ్రీలక్ష్మి మహాయజ్ఞం నిర్వహిస్తున్నట్లు పంచముఖ ఆంజనేయస్వామి ఆలయ ఈఓ అవుతు శ్రీనివాసరెడ్డి తెలిపారు. షరాఫ్ బజార్‌లోని పంచముఖ ఆంజేయస్వామి ఆలయంలో గురువారం మహా యజ్ఞానికి సంబంధించిన బ్రోచర్లను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఈవో శ్రీనివాసారెడ్డి మాట్లాడుతూ మహా యజ్ఞంలో అనేక ఆశ్రమాలకు చెందిన పండితులు పాల్గొని, శాస్త్రోక్తంగా కార్యక్రమాన్ని నిర్వహిస్తారని చెప్పారు. ప్రతి రోజు విశేష కార్యక్రమాలతో పాటు, పలువురు పీఠాధిపతుల అనుగ్రహ భాషాను, ప్రవచన కార్యక్రమాలు ఉంటాయన్నారు. ఆలయ వంశ పారంపర్య అర్చకులు శ్రీనివాసమూర్తి, అర్చకులు కిరణ్, సురేష్, సిబ్బంది పాల్గొన్నారు.

14 నుంచి హనుమజ్జయంతి మహోత్సవాలు



ఏర్పాట్లు చేస్తున్న ఆలయ సిబ్బంది

తెనాలిటౌన్: షరాఫ్ బజార్‌లో సువర్చలా సమేత పంచముఖ ఆంజనేయస్వామి దేవస్థానంలో ఈ నెల 14 నుంచి 24 వరకు హనుమజ్జయంతి మహోత్సవాలు నిర్వహిస్తున్నట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి శ్రీనివాసారెడ్డి గురువారం తెలిపారు. ఉత్సవాలకు సంబంధించిన ఏర్పాట్లను ఆయన పరిశీలించారు. అనంతరం ఆలయ వంశపారంపర్య అర్చకులు ఆర్.శ్రీనివాసమూర్తితో కలిసి ఉత్సవాలు వివరాలు వెల్లడించారు. పది రోజులు జరిగే ఉత్సవాల్లో ప్రతి రోజూ విశేష పూజలు, హోమాలు, హనుమాన్ చాలీసా పారాయణం జరుగుతాయని తెలిపారు. 13న పుర వీధుల్లో హనుమాన్ శోభా యాత్ర జరుగుతుందని, భక్తులు విశేషంగా పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. ఉత్సవాల్లో భాగంగా ప్రతి రోజు సాయంత్రం పండితులు ములుకుట్ల విశ్వనాథశర్మచే సుందరకాండ ప్రవచనం జరుగుతుందని అర్చకులు కిరణ్‌కుమార్ తెలిపారు. అర్చకులు సురేష్, సంకీర్తన బృందం అధ్యక్షులు మూర్తి అనురాధ, సభ్యులు శారద, విజయలక్ష్మి, పద్మావతి, లక్ష్మీసునీత, శాంతి, రామలక్ష్మి, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు సత్కారం



తెనాలి: పదో తరగతి పరీక్షల్లో మున్సిపల్ ఉన్నత పాఠశాలల విద్యార్థులు అత్యున్నత ఫలితాలను సాధించటం గర్వకారణమని చైర్‌పర్సన్ సయ్యద్ ఖలేదా నసీమ్ అన్నారు. స్థానిక మున్సిపల్ కౌన్సిల్ హాలులో గురువారం ఏర్పాటు చేసిన సభలో పదో తరగతి పరీక్షల్లో మంచి మార్కులు సాధించిన విద్యార్థులు, వారి తల్లిదండ్రులను చైర్‌పర్సన్ ఖలేదా నసీమ్, వైస్ చైర్మన్ మాలేపాటి హరిప్రసాద్, కమిషనర్ ఎం.జస్వంతరావు సత్కరించి, జ్ఞాపికలు అందజేశారు. సభకు అధ్యక్షత వహించిన ఖలేదా నసీమ్ మాట్లాడుతూ, మున్సిపల్ ఉన్నత పాఠశాలల్లో చదివిన పదోతరగతి విద్యార్థులు పలువురు 550 పైగా మార్కులు సాధించటం సంతోషంగా ఉందన్నారు. ప్రభుత్వ పరంగానూ విద్యార్థులను ఎంతగానో ప్రోత్సహించినట్లు గుర్తు చేశారు. పరీక్షలకు ముందు నుంచే ప్రత్యేక తరగతులను నిర్వహించి, అల్పాహారం పంపిణీ చేసిందని చెప్పారు. ప్రభుత్వ ఆశయానికి తగినట్టుగా, తల్లిదండ్రుల ఆకాంక్షలను నెరవేర్చేలా ఉత్తమ ఫలితాలను కైవసం చేసుకున్న విద్యార్థులు, కాలేజి విద్యలోనూ మంచి మార్కులతో ఉన్నతంగా ఎదగాలని కాంక్షించారు. ఉపాధ్యాయులు, ప్రధానోపాధ్యాయులకు అభినందనలు తెలిపారు. అసిస్టెంట్ కమిషనర్ ఎం.గోపాలరావు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకు సెలవులు ఇవ్వాలి: ఫ్యాప్టో



గుంటూరు ఎడ్యుకేషన్: వేసవి సెలవుల్లో ఉపాధ్యాయులకు అప్పగిస్తున్న వివిధ రకాల పనుల నుంచి విముక్తి కల్పించాలని కోరుతూ జిల్లా విద్యాశాఖాధికారి పి.శైలజకు ఉపాధ్యాయ సంఘాల సమాఖ్య (ఫ్యాప్టో) జిల్లా నాయకులు విజ్ఞప్తి చేశారు. వేసవిలో ఉపాధ్యాయులకు సెలవులు ఇవ్వకుండా వేర్వేరు కార్యక్రమాల్ని అప్పగించి, పాఠశాలల్లోనే ఉండాలని అధికారులు ఒత్తిడి చేయడాన్ని వ్యతిరేకిస్తూ ఫ్యాప్టో రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు గురువారం స్టాల్ బాలికోన్నత పాఠశాలలో డీఈవో శైలజను కలసి వినతిపత్రం సమర్పించారు. ఫ్యాప్టో జిల్లా చైర్మన్ ఎం. కళాధర్ మాట్లాడుతూ నాడు-నేడు, ఆన్‌లైన్ ట్రైనింగ్, టెన్త్‌లో ఫెయిల్ అయిన విద్యార్థులకు ప్రత్యేక బోధనా తరగతుల పేరుతో రాతపూర్వక ఆదేశాలు లేకుండా మౌఖిక ఆదేశాల ద్వారా ఉపాధ్యాయులపై ఒత్తిడి తెస్తున్నారని పేర్కొన్నారు. సెలవుల్లో పనిచేసినందుకు సంపాదిత సెలవులు మంజూరు చేయాలని కోరారు. ఫ్యాప్టో డెప్యూటీ సెక్రటరీ జనరల్ జి. మోహనరావు, ఎండీ. ఖాలీద్, జి. వేళాంగిణిరాజు ఉన్నారు.

బాలికపై లైంగిక దాడి

గుంటూరు ఈస్ట్: బాలికపై యువకుడు లైంగిక దాడికి పాల్పడిన ఘటనపై అరండల్‌పేట పోలీసులు కేసు నమోదు చేశారు. శ్రీనగర్ 2వ లైనులో నివసించే సునీల్ చంద్రయ్యనగర్‌లోని స్నేహితుడి ఇంటికి వెళుతుంటాడు. ఈ సమయంలో పక్కనే ఉన్న ఇంట్లోని బాలికతో పరిచయం పెంచుకున్నాడు. బుధవారం తన పుట్టిన రోజు అని చెప్పి ఆమెను ద్విచక్ర వాహనంపై ఎక్కించుకుని ఇంటికి తీసుకెళ్లాడు. అక్కడ బలవంతంగా లైంగిక దాడికి పాల్పడ్డాడు. అనంతరం బాలికను ఇంటి సమీపంలో వదిలిపెట్టి పరారయ్యాడు. బాలిక తల్లిదండ్రులు గురువారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఇంజినీరింగ్ విద్యార్థిని ఆత్మహత్య

ఇంజినీరింగ్ విద్యార్థిని ఆత్మహత్యపై పట్టాభిపురం పోలీసులు కేసు నమోదు చేశారు. ఈపూరుకు చెందిన వెంకట నరసింహారావు కుమార్తె జి.శ్రీప్రణీత (20) గుంటూరు విద్యానగర్‌లోని బంధువుల ఇంట్లో ఉండి ఇంజినీరింగ్ మూడో సంవత్సరం చదువుతోంది. చదువులో వెనుకబడడంతో మానసికంగా కుంగిపోయి ఈనెల 7న ఎలుకల మందు తిని, కుటుంబ సభ్యులకు ఆలస్యంగా చెప్పింది. ఆమెను నగరంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చేర్పించగా చికిత్స పొందుతూ గురువారం మృతి చెందింది.